

64

ధారావాహిక

# జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి
99893 71284

**జరిగిన కథ :** అధికారిక సమావేశాలతో అలసిపోయిన చక్రవర్తి.. ఆరోజున సరాసరి నారాంబ అంతఃపురానికి వచ్చాడు. విశ్రాంతిగా పర్యంకంపై జారగిలబడ్డాడు. అయితే, ఎప్పుడూ దేవళపు గంటలా గణగణా మోగుతూ ఉండే నారాంబ.. మౌనంగా ఉండటంతో గణపతిదేవుడు ఆశ్చర్యపోయాడు.

ఆమె చాలా తీవ్రంగా ఆలోచిస్తున్నది. ఆమె అందమైన ముఖం చింతాక్రాంతమై ఉన్నది. తాటిముంజల్లాంటి కనుదోయి గిరుగిర్రున తిరుగుతున్నాయి. ఆమెను చూస్తేచాలు.. గణపతిదేవుని అలసట మటుమాయమై పోతుంది. మాట వింటే చాలు.. హాయిగా నవ్వుకోవచ్చు.

అప్పుడే పరిచారికలు పిల్లలను తీసుకువచ్చారు. వాళ్లిద్దరూ తండ్రి వైపు పరుగులు పెడుతూ వచ్చి.. ఆయన తొడలపైకి ఎగబాకారు. మరో పరిచారిక బంగారు కోరలో చల్లని మజ్జిగ అందించింది. మరోకామె వేడివేడి జున్నుముక్కలున్న పళ్లెరం ఆయన ముందుంచింది. మరో పరిచారిక చేతులు కడుక్కోవడానికి పాత్ర ముందుంచగా.. అందులో చేతులు శుభ్రపరచుకుని జున్నుముక్కల పళ్లెరం అందుకుంటూ..

''ఊ.. ఏమిటి? మహారాణి వారు సుదీర్ఘంగా ఆలోచించడానికి కారణం ఏమిటో..?'' అని అన్నాడు.

''ఏమీ లేదండి. మన జాయపుడు.. రోజూ ఎవ్వరికీ చెప్పకుండా బయటికి వెళ్తున్నాడు..'' అన్నదామె.

ఆయనకు అలసటంతా ఎగిరిపోయింది.

''అలాగా!? అయినా జాయపుడు దినమూ నాట్య గురుకులానికో.. మిత్రుల వద్దకో.. బౌద్ధారామాలకో.. జైన గ్రంథాలయాలకో.. ఘటికలకో వెళ్తూనే ఉంటాడుగా! ఇందులో ఆశ్చర్యమేమున్నది..?''.

ఆమె ఆయన చెవి వద్ద వంగి..

''వాడు మారువేషంలో వెళ్తున్నాడు..'' అని చెప్పింది.

ఆయనలోని హాస్యధోరణి మాయమైంది.

''మారువేషంలో వెళ్లడం ఏమిటి? చారులకు ఎవ్వరికైనా చెప్పకపోయావా.. పరిశీలించమని!'' అన్నాడు.

''పాపం.. తెలిస్తే వాడు బాధపడతాడండీ!''.

''అబ్బా.. అయితే తమరు దీర్ఘంగా ఆలోచించడం ఎందుకూ!? జాయపుడేమీ తప్పు చెయ్యడు. అనుమకొండ వీధులు, డొంకలు క్షుణ్ణంగా తెలిసినవాడు. లోకంపోకడ అర్థం చేసుకున్నవాడు. దారి తప్పడు.. ఏ రాత్రి అయినా నీ మందిరానికే చేరతాడు!''.

చెబుతూనే ఆలోచనలో పడ్డాడు.

'మారువేషం ఎందుకబ్బా!?'.

''ఎవరైనా పల్లెటూరి అమ్మాయి కోసమని.. నా సందేహం! అసలే అందగాడు. పైగా మీ బావమరిది!''.

అప్పుడే లోపలికివచ్చాడు జాయపుడు.

ఆమె భర్తను మోచేత్తో పొడిచి..

''అడగండి. ఎక్కడికి వెళ్లివస్తున్నాడో!'' అన్నది.

'అడిగితే బావుండదు' అన్నట్లు కళ్లతో చెప్పి, జాయపుణ్ని చూసి పలకరింపుగా నవ్వాడు. రైతుదుస్తుల్లో ఉన్న జాయపుడు వినయంగా నమస్కరించి నవ్వి..

''దుస్తులు మార్చుకుని వస్తాను బావగారూ..'' అంటూ లోపలికి వెళ్లిపోయాడు.

ఆయన పిల్లలతో ఆడుకుంటున్నాడు. నారాంబ కాలు కాలిన పిల్లిలా అటూ ఇటూ తిరుగుతున్నది.

''ఒక్కరోజు చూసి అడిగితే ఏమైనా అనుకుంటాడు. కారణం లేనిదే అలా వెళ్లడు. మరోవారం చూశాక అడుగుదాం..'' అన్నాడు చక్రవర్తి.

అంగీకరించక తప్పలేదు నారాంబకు.

మరోవారం రోజుల తర్వాత.. మళ్లీ సమస్య లేవదీసింది గణపతిదేవుని వద్ద.

''వాడు నిత్యం సాధారణ దుస్తుల్లో మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్తున్నాడు. మీరు చూడమన్నారని ప్రతినిత్యం కళ్లింత చేసుకుని చూస్తున్నా.. ఇప్పుడు చెప్పండి ఏం చేద్దాం??''.

గణపతిదేవుడు ఆలోచించి ఏం చెయ్యాలో చెప్పాడు.

* * *

'వహోం వహోం హోం'..

మహారాణి వారి పల్లకి పోతూనే ఉంది. వెనుక అల్లంత దూరాన గుర్రాలపై రక్షక భటులు.

పల్లకిలో కుదురుగా కూర్చోలేకపోతున్నది నారాంబ. మాటిమాటికీ తెర తొలగించి బయటికి చూస్తున్నది. అప్పటికే భటులు దగ్గరకొచ్చి చెప్పారు..

''మహారాణి.. తమరు పల్లకిలో ఉన్నట్లు ఎవరికీ తెలియదు. దయచేసి తెర తొలగించకండి. ఆ గ్రామం దగ్గరికి రాగానే మేమే తెలియపరుస్తాం!'' అని.

''అలాగే!'' అన్నది కానీ.. ఆమె తన ఉత్సుకతను అణచుకోలేకపోతున్నది.

చివరికి నిర్దేశించిన గ్రామంలో.. గ్రామస్తులు చూపిన ఊరిచివర మర్రిమాను వద్ద పల్లకి ఆగింది. ఈవల చావిడి నీడలో విక్రమ..

కనిపించినంత మేరా భూమి, ఆకాశం పచ్చ, నీలిమల